# నాయకుడిగా కాదు.. సేవకుడిగా పనిచేస్తా



ఈటలను సన్మానిస్తున్న హయత్‌నగర్ బీజేపీ నాయకులు

మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్

**హయత్‌నగర్:** తనపై నమ్మకంతో భారీ మెజార్టీతో గెలిపించి పార్లమెంట్‌కు పంపిన మల్కాజిగిరి ప్రజలకు ఎప్పుడు రుణపడి ఉంటానని, వారికి నాయకుడిగా కాకుండా సేవకుడిగా పని చేస్తానని మల్కాజిగిరి ఎంపీగా విజయం సాధించిన ఈటల రాజేందర్ అన్నారు. బీజేపీ నాయకులు, డివిజన్ ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుతూ హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఈటల ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జీవితంలో మరిచి పోలేనంత గొప్ప విజయాన్ని ఇక్కడి ప్రజలు అందించారని, వారి ఆదరణను మరిచిపోలేనని అన్నారు. హయత్‌నగర్ డివిజన్ ప్రజలకు ఎలాంటి సమస్య వచ్చినా స్థానిక కార్పొరేటర్ ద్వారా తన దృష్టికి తీసుకురావాలని, వెంటనే పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. బీజేపీ అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామరంగారెడ్డి, రాష్ట్ర నాయకులు కళ్లెం రవీందర్‌రెడ్డి , నాయకులు బండారి భాస్కర్, కోట రవీందర్, వెంకటేష్‌గౌడ్, పారంద మహేష్, సంఘి అశోక్, గోవిందాచారి పాల్గొన్నారు.

**సంక్షేమ పాలన అందిస్తా ..**

**మన్సూరాబాద్:** పెద్దచెరువు ప్రాంగణంలో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం కృతజ్ఞత సభ ఏర్పాటు చేశారు. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌తో పాటు మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈటల మాట్లాడుతూ, తనపై నమ్మకంతో ప్రజలంతా ఎంతో బాధ్యతగా ఓట్లు వేసి గెలిపించారని, అంతే బాధ్యతగా సంక్షేమ పాలన అందిస్తానని అన్నారు. నాయకులు సామ రంగారెడ్డి, కొత్త రవీందర్‌గౌడ్, నాంపల్లి రామేశ్వర్, పాతూరి శ్రీధర్‌గౌడ్, గంగదాసు కృష్ణారెడ్డి, సాయిరాంగౌడ్ పాల్గొన్నారు.

# బక్రీద్‌కు సర్వం సిద్ధం

**మసీద్‌ల ముస్తాబు**

**నేటి సామూహిక ప్రార్థనలకు ప్రత్యేక ఏర్పాట్లు**

**దిల్‌సుఖ్‌నగర్:** మలక్‌పేట జోన్ పరిధిలో బక్రీద్ సందడి నెలకొంది... ముస్లింలు ఈ రోజు త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్‌ను జరుపుకోనున్నారు. ఈద్ నేపథ్యంలో మసీదులను అందంగా ముస్తాబు చేశారు. విద్యుద్ దీపాలతో అలంకరించారు. దిల్‌సుఖ్‌నగర్, ఆర్‌కేపురం, సరూర్‌నగర్, మాదన్నపేట, సైదాబాద్, అక్బర్‌బాగ్, అజంపురా, ఓల్డ్‌మలక్‌పేట, చాదర్‌ఘాట్, మూసారంబాగ్ తదితర ప్రాంతాల్లోని మసీదులు, ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనల కోసం ఏర్పాటు చేశారు. షామియానాలు ఏర్పాటు చేసి తాగునీటిని అందుబాటులో ఉంచుతున్నారు.

**జోరుగా గొర్రెల కొనుగోళ్లు..**

◆ గొర్రెల క్రయ, విక్రయాలతో చంచల్‌గూడ, సైదాబాద్ తదితర ప్రాంతాలు సందడిగా మారాయి. ఈద్ నేపథ్యంలో 'ఖుర్బానీ' ఇవ్వడానికి పొట్టేళ్లు, గొర్రెలు, మేకలను కొనుగోలు చేస్తున్నారు. గొర్రె, మేకల ధరలు వాటి బరువు, విక్రయిస్తున్న ప్రాంతాలను బట్టి తేడా ఉంటోంది. ఒక్కో గొర్రె, మేక కనీస ధర రూ. 6 వేల మొదలు.. రూ. 75 వేలు, రూ.లక్షకు పైగానే పలుకుతోంది. బక్రీద్ ప్రార్థనల నేపథ్యంలో ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అన్ని ప్రాంతాల్లో పోలీసులు ముందస్తు బందోబస్తు ఏర్పాటు చేశారు.



ప్రత్యేక ప్రార్థనలకు సిద్ధమైన మాదన్నపేట ఈద్గా



చంచల్‌గూడ ప్రధాన రోడ్డుపై గొర్రెలు, మేకల విక్రయాలు

## కల్యాణం.. కమనీయం



వేడుకల్లో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, నాయకులు

**అబ్దుల్లాపూర్‌మెట్:** మండల పరిధిలోని పిగ్లీపూర్‌లో గల శ్రీ మల్లికార్జున స్వామి దేవాలయంలో ఆదివారం స్వామివారి కల్యాణోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రోడ్ల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, కాంగ్రెస్ నాయకులు రామ్మోహన్‌గౌడ్, బీఆర్‌ఎస్ పార్టీ భువనగిరి ఇన్‌చార్జి క్యామ మల్లేష్, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నామినేటెడ్ పదవులు ఇవ్వాలి

కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు

**హుడాకాంప్లెక్స్:** కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని నిజాయితీ, నిబద్ధతో పనిచేసిన ముఖ్య నేతలకు నామినేటెడ్ పదవులు ఇవ్వాలని జిల్లా ప్రధాన కార్యదర్శి వక్కలంక శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆదివారం తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ క్యాంపెయినర్ కమిటీ చైర్మన్ మధుయాష్కిగౌడ్‌తో ఆయన మాట్లాడారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు కూడా పార్టీ వీడలేదని, 40 సంవత్సరాలుగా పార్టీకి అండదండగా పనిచేసిన వారిని గుర్తించాలన్నారు. పార్టీలు మారిన వారు పదవులు రాకపోతే వెళ్లిపోతారని, కొందరు పదవులు కాపాడుకోవడానికి పార్టీలో చేరుతారని, నిజమైన కార్యకర్తలు ఎళ్లప్పుడూ అండగా ఉంటారన్నారు. తమలాంటి వారు చాలా మంది పార్టీని నమ్ముకుని చాలా కాలం నుంచి ఉన్నారని చైర్మన్, డైరెక్టర్ పదవులనైనా కెటాయించాలని కోరారు.

## పేద విద్యార్థులను ప్రోత్సహించాలి



చెక్కు అందిస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

**లక్డీకాపూల్:** పేద విద్యార్థుల చదువులకు అవసరమైన సహాయం చేసి వారిని ప్రోత్సహించడం అభినందనీయమని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. ఆదివారం లక్డీకాపూల్‌లోని ఎంఎస్‌ఆర్ ట్రస్ట్ కార్యాలయంలో నిరుపేదలైన విద్యార్థులకు చదువులకు సహాయం అందించారు. ఈసందర్భంగా ప్రసాద్‌కుమార్ హాజరై మాట్లాడారు. విద్య, వైద్యానికి సహాయం చేసేవారు మంచి పేరు సంపాదిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో దాదాపు 300 మంది విద్యార్థులకు చెక్కుల రూపంలో సాయం అందచేశారు. ట్రస్ట్ నిర్వాహకులు శివారెడ్డి, శిరీష రెడ్డి పాల్గొన్నారు.

## వైభవంగా నిమిషాంబదేవి బ్రహ్మోత్సవాలు

**బోడుప్పల్:** పెంటారెడ్డి కాలనీలోని శ్రీమాతా నిమిషాంబదేవి అష్టదశ 18వ వార్షిక బ్రహ్మోత్సవాలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవతా ప్రార్థన, గోపూజ, శాంతి మంత్ర పఠనం, విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, యాగశాల ప్రవేశం, అంకురార్పణ, ధ్వజారోహణ, ప్రధాన దేవతా కలశ స్థాపన, మూల మంత్ర హోమం, సామూహిక చండీహోమం నిర్వహించారు. నీరాజనం, చతుర్వేద స్వస్తి, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారిని బంగారు చీరెతో అలంకరించారు. ఆలయ చైర్మన్ వినోద్‌కుమార్, ప్రధాన కార్యదర్శులు అశోక్‌కుమార్, శ్రీనివాస్, కోశాధికారి రమేష్, నకాష్ సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

# త్యాగానికి మారుపేరు.. నాన్నే!

**'బచ్‌పన్ అకడమిక్ హైట్స్' లో ఘనంగా ఫాదర్స్ డే**

**నాగోలు:** 'ఓర్పుకు మారుపేరు.. మార్పుకు మార్గదర్శి.. మన ప్రగతికి సోపానం వేసేది నాన్నే'... అంతటి ఉన్నతమైన వ్యక్తిని నాన్నగా పొందడం మన అదృష్టమని బచ్‌పన్-అకడమిక్ హైట్స్ పాఠశాల డైరెక్టర్ జితేంద్ర దేవి అన్నారు. ఆదివారం కొత్తపేటలోని బచ్‌పన్, అకడమిక్ హైట్స్ పాఠశాలలో ఫాదర్స్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పిల్లల పట్ల తండ్రి బాధ్యత ఎంతో గొప్పది, విలువైనది, త్యాగనీయమైనదని అన్నారు. తల్లిదండ్రుల అడుగు జాడల్లో నడుస్తూ వారి నిమూసుకోవాల్సి బాధ్యత కూడా పిల్లలదేనని అన్నారు. విద్యార్థులతో పాటు తండ్రులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ స్వీటీ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



ఆటల పోటీల్లో పాల్గొన్న విద్యార్థుల ఫాదర్స్

## కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి



కార్పొరేటర్ లచ్చిరెడ్డితో వీరాంజనేయ కాలనీవాసులు

**ఎల్‌బీనగర్:** కాలనీలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు.డివిజన్ పరిధిలోని వీరాంజనేయ కాలనీ సంక్షేమ సంఘ నాయకులు ఆదివారం లచ్చిరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి కాలనీలో నెలకొన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా లచ్చిరెడ్డి మాట్లాడుతూ, కాలనీ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, ప్రణాళి బద్ధంగా కాలనీలను అభివృద్ధి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు రామయ్య, ప్రధాన కార్యదర్శి సుధాకర్, సంయుక్త కార్యదర్శి రహీం, సభ్యులు భాష, శివ, శంకరయ్య, సత్యనారాయణరెడ్డి, బాబు, రమేష్, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కార్మికులు ఉద్యమించాలి: సీపీఐ

**నాగోలు:** దేశంలో కార్మిక చట్టాలను కాలరాస్తున్న కేంద్రం ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ కార్మికులు ఉద్యమించాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవీంద్ర చారి పిలుపునిచ్చారు. సరూర్‌నగర్ మండల ఏఐటీయూసీ నిర్మాణ మహాసభ కొత్తపేటలో ఆదివారం నిర్వహించారు. కార్యక్రమాని ముఖ్యఅతిథిగా హాజరైన రవీంద్రచారి మాట్లాడుతూ, కార్మికుల సంక్షేమం కోసం ఎన్నో పోరాటాల చేసి తెచ్చుకున్న చట్టాల్లో కేంద్ర ప్రభుత్వం మార్పులు తీసుకొచ్చి నిర్వీర్యం చేస్తోందని అన్నారు. కార్మికులందరూ ఐక్యంగా ఉండి కార్మిక చట్టాలను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పర్వతాలు, రాష్ట్ర భవన నిర్మాణ కార్యదర్శి ప్రవీణ్‌గౌడ్‌లు మాట్లాడుతూ దోపిడీ వ్యవస్థపై పోరాటానికి కార్మిక వర్గాన్ని ఐక్యం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఏఐటీయూసీ సరూర్‌నగర్ మండల అధ్యక్షుడిగా రాములుగౌడ్, ప్రధాన కార్యదర్శిగా మద్దిలేనిని, కమిటీ సభ్యులుగా గోపాల్, సత్యనారాయణ, కరుణాకర్, సీహెచ్ యాదయ్య, నరేష్, చిన్నారి జ్యోతి, దర్శన్‌లను ఎన్నుకున్నారు. సమావేశంలో సరూర్‌నగర్ సీపీఐ మండల కార్యదర్శి బాతురాజు నరసింహ తదితరులు పాల్గొన్నారు.




సభలో మాట్లాడుతున్న రవీంద్రచారి

## బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం : ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి



బీజేపీలో చేరిన బీఆర్‌ఎస్ నాయకులతో కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

**మహేశ్వరం:** బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. మహేశ్వరం మండలం నాగిరెడ్డిపల్లి, నాగిరెడ్డిపల్లి తండాకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి మిద్దే సుదర్శన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు మాధవరాచిల ఆధ్వర్యంలో ఆదివారం ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. చేరిన వారిలో మిద్దే శివారెడ్డి, తూర్పాటి కృష్ణ, ఆంగోత్ కృష్ణనాయక్, ఆంగోత్ రాజేష్, దేవిజా, సాంటి నర్సింహ, కాట్రావత్ సోమనాథ్, కాట్రావత్ రమేష్, ప్రకాశ్, సేవల, మునావత్ రాములు, శ్రీను, జరుపుల శ్రీను, తుల్జా, నేనావత్ గోపాల్‌లు ఉన్నారు. ఈ సందర్భంగా ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి చేరిన వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొండూరి మనోహర్, సిద్దు సురేందర్‌చారి, కాట్రావత్ కిషన్‌నాయక్, కడల పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి దైవ సన్నిధానం వార్షిక బ్రహ్మోత్సవాలు

**బంజారాహిల్స్:** విశాఖ శ్రీశారదాపీఠ పాలిత ఫిలింనగర్ దైవ సన్నిధానం వింశతి (20వ) వార్షిక బ్రహ్మోత్సవాలను ఈ నెల 17 (సోమవారం) నుంచి 21వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా తొలి రోజు సోమవారం ఉదయం 8 గంటలకు విశేష అలంకారం, గణపతి పూజ, యాగశాల ప్రవేశం, హారతితో ఉత్సవాలు ప్రారంభం అవుతాయని ఆలయ ప్రతినిధులు తెలిపారు. 18న ఉదయం శ్రీస్మార్తాగమ, శ్రీవైఖానస ఆగమముల ప్రకారం విశేష అలంకారం, సాయంత్రం శ్రీభ్రమరాంబికా సమేత శ్రీమల్లికార్జునస్వామి వారి శాంతి కల్యాణం, రాత్రి అమృత గోపాల్‌చే కర్ణాటక సంగీత కచేరీ ఉంటాయన్నారు. 19న ఉదయం శ్రీభ్రమరాంబికా సమేత మల్లికార్జునస్వామి వారికి పంచామృతాభిషేకం, సాయంత్రం శ్రీభూసమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి శాంతి కల్యాణం, 20న ఉదయం స్వామి వారికి విశేష పంచామృతాభిషేకం,21న ఉదయం చూర్ణోత్సవం, చక్రస్నానం ఉంటాయన్నారు. బ్రహ్మోత్సవాల్లో రోజూ మధ్యాహ్నం 12.30 నుంచి 3 గంటల వరకు అన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు.

# పేదల వైద్యానికి సీఎంఆర్‌ఎఫ్ భరోసా



సీఎం సహాయ నిధి ఎల్‌ఓసీ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

**హస్తినాపురం:** సీఎం సహాయనిధి పేద ప్రజలకు వరం లాంటిదని, వారి ఆరోగ్య పరిరక్షణకు, వైద్యానికి భరోసా గా నిలుస్తోందని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. హస్తినాపురం డివిజన్‌లోని నందనవనం కాలనీలో నివాసముంటున్న రమణి మోకాళ్ల నొప్పులతో బాధపడుతోంది. ఆర్థిక పరిస్థితి బాగాలేక వారి కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని సంప్రదించారు. స్పందించిన ఆయన మహిళ ఆపరేషన్‌కు కావాల్సిన డబ్బుల వివరాలతో సీఎం సహాయనిధికి దరఖాస్తు చేయించగా, లక్ష రూపాయల ఎల్‌ఓసీ చెక్కు మంజూరైంది. ఈ చెక్కును ఆదివారం బాదితురాలి సోదరుడు లింగంకు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో చాతిరి మధుసాగర్, రాకేశ్‌తాగూర్ తదితరులు పాల్గొన్నారు.

# నాలా పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి



నాలా నిర్మాణ పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి

**సైదాబాద్:** ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలో కొనసాగుతున్న నాలా నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్లు నాణ్యత ప్రమాణాలు కచ్చితంగా పాటించేలా అధికారులు తరచూ పర్యవేక్షిస్తుండాలని కార్పొరేటర్ జంగం శ్వేతా మధుకర్‌రెడ్డి సూచించారు. ఆదివారం కార్పొరేటర్ డివిజన్ పరిధిలోని సింగరేణి ఆఫీసర్స్ కాలనీ, ఆదర్శనగర్ కాలనీల్లో కొనసాగుతున్న నాలా నిర్మాణ పనులను ఎస్‌ఎన్‌డీపీ అధికారులు, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వర్షాకాలం సమీపిస్తున్నందున నాలా నిర్మాణ పనులను వేగవంతం చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎన్‌డీపీ ఈఈ రోహిణి, డిప్యూటీ ఈఈ కనకయ్య, ఏఈ భరత్, జంగం మధుకర్‌రెడ్డి, అజయ్ రెడ్డి, కేఎస్‌ఎన్ రెడ్డి, రమణ, రాజశేఖర్‌రెడ్డి ఉన్నారు.

# ఇసుక క్వారీల్లో అవినీతిపై చర్యలు చేపట్టాలి



మాట్లాడుతున్న వెన్నపూజ పరశరాజ్

**మన్సూరాబాద్:** ఇసుక క్వారీల్లో జరుగుతున్న అవినీతిపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సామాజిక తెలంగాణ ఫ్రంట్ చైర్మన్, హైకోర్టు అడ్వకేట్ వెన్నపూజ పరశరాజ్ అన్నారు. తెలంగాణ మైన్స్ అండ్ సాండ్ లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆవిర్భావ సభ రాష్ట్ర అధ్యక్షుడు సుర్వీ దామోదర్ అధ్యక్షతన హయత్‌నగర్ పరిధిలోని లెక్చరర్స్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన వెన్నపూజ పరశరాజ్ మాట్లాడుతూ, ఇసుక క్వారీల్లో ఎస్‌పీఓ, ఆర్‌ఓలు కాంట్రాక్టర్లతో కుమ్మక్కై ప్రైవేటు వ్యక్తుల ద్వారా లారీ డ్రైవర్లను బెదిరించి.. లారీకి రూ.4500 చొప్పున వసూల్ చేస్తున్నారని ఆరోపించారు. లారీల్లో మైనింగ్ అధికారులే ఓవర్ లోడ్ వేసి లారీలు క్వారీ నుంచి బయటకు రాగానే చలాన్లు వేసి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఇసుక క్వారీల్లో పని చేస్తున్న మైనింగ్ అధికారులను వేరే శాఖకు బదిలీ చేసి, క్వారీల్లో ప్రత్యేక నిఘా అధికారులను ఏర్పాటు చేయాలని కోరారు. తెలంగాణ ఫైటర్స్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ తెప్పా అరుణ, సీహెచ్ యాదగిరి, స్వామిగౌడ్, శేఖర్‌గౌడ్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ సీనియర్ నాయకుడు అశోక్‌గౌడ్ మృతి



కాట అశోక్‌గౌడ్ (ఫైల్)



అశోక్‌గౌడ్ మృతదేహంపై బీజేపీ జెండా కప్పుతున్న ఎంపీ ఈటల రాజేందర్

**నాగోలు:** దశాబ్దాలుగా కాట అశోక్ గౌడ్ బీజేపీకి చేసిన సేవలు చిరస్మరణీయమని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు.బీజేపీ కొత్తపేట డివిజన్ మాజీ అధ్యక్షుడు, పార్టీ రంగారెడ్డి జిల్లా సమన్వయ కమిటీ అధ్యక్షుడు కాట అశోక్ గౌడ్ ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. సమాచారం తెలిసిన ఈటల...రంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, కార్పొరేటర్లు పవన్‌కుమార్, నరసింహారెడ్డి తదితరులతో కలిసి కొత్తపేట గ్రామానికి వచ్చారు. అశోక్ గౌడ్ మృతదేహంపై బీజేపీ జెండాను కప్పి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో నాయకులు కొత్త రవీందర్‌గౌడ్, యశ్పాల్‌గౌడ్, జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి జంగారెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ లింగాల నాగేశ్వరరావు, బీఆర్‌ఎస్ కొత్తపేట డివిజన్ అధ్యక్షుడు లింగాల రాహుల్ గౌడ్ తదితరులు ఉన్నారు.

# 'నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ'పై విచారణ జరిపించాలి

**కాచిగూడ:** నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని బీసీ విద్యార్థి సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం కాచిగూడలో ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే బిహార్‌కు చెందిన గ్యాంగ్ నీట్ పేపర్ లీకేజ్ చేశాయన్న విషయం బయటకు రావడంతో ఈ విషయంలో ప్రధాని నరేంద్రమోదీ వెంటనే స్పందించాలన్నారు. మెడికల్ కౌన్సెలింగ్‌ను వెంటనే నిలిపివేయాలని, అర్హులైన విద్యార్థులందరికీ న్యాయం జరిగేలా చూడాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేశంలోనే నీట్ పరీక్ష పెద్ద స్కామ్‌గా మారిందని, నీట్ పరీక్ష నిర్వహణలో విఫలమైన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీపై సీబీఐ దర్యాప్తు సంస్థచే విచారణ జరిపించాలన్నారు. ఈ స్కామ్ వెనుక ఉన్న ఎంతటివారినైనా వదిలిపెట్టకుండా దేశద్రోహం కింద శిక్షించాలన్నారు. లేని పక్షంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ నేతృత్వంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. రాజేష్, వినోద్, ప్రవీణ్, ఉదయ్, అభిలాష్, గిరీష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## రైతుబజార్లలో కూరగాయల ధరలు

**దిల్‌సుఖ్‌నగర్:** సరూర్‌నగర్, వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో...రూపాయల్లో...) టమోటా లోకల్ 57, వంకాయ 28, బెండ 60, పచ్చిమిర్చి 65, కాకర 55, బీర 75, క్యాలీఫ్లవర్23, క్యాబేజీ 23, క్యారెట్ 45. దొండ 40, ఆలు 33, ఉల్లి 39, గోకర 50, దోస 28, సొర 15, పొట్ల 18, అరటి 11, చిక్కుడు 65, అర్వి 40, మునగ 80, చిలగడదుంప 45, బీట్‌రూట్ 19, కీర 35, ఫ్రెంచ్ బీన్స్ 135, కాప్సికమ్ 70. సోమవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే ఈ ధరలు అమలులో ఉంటాయి.

## ప్రజా సంక్షేమమే లక్ష్యం

ఎమ్మెల్యే సబితారెడ్డి



ఎల్‌ఓసీ అందిస్తున్న సబితారెడ్డి తదితరులు

**కందుకూరు:** ప్రజా సంక్షేమమే లక్ష్యమని ఎమ్మెల్యే సబితారెడ్డి పేర్కొన్నారు. కందుకూరుకు చెందిన కొమ్మగళ్ల జ్యోతి అనారోగ్యంతో బాధపడుతూ, ఆస్పత్రిలో చికిత్స పొందడానికి డబ్బులు లేక ఇబ్బందులు పడుతుంది. ఈ విషయాన్ని ఎంపీటీసీ సభ్యుడు రాజశేఖర్‌రెడ్డి ఎమ్మెల్యే సబితారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆమె సహకారంతో సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.1.20లక్షల ఎల్‌ఓసీ మంజూరు చేయించారు. మంజూరైన ఎల్‌ఓసీని ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జ్యోతి కుటుంబీకులకు ఎమ్మెల్యే సబితారెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ రాజశేఖర్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడు తాళ్ల కార్తీక్, సోషల్ మీడియా కన్వీనర్ బొక్క దీక్షిత్‌రెడ్డి, బాలయ్య పాల్గొన్నారు.

## ఇంటి తాళం పగులగొట్టి బంగారం చోరీ

**మలక్‌పేట:** ఇంటి తాళం పగులగొట్టి బంగారు నగలు అపహరించుకెళ్లిన ఘటన మలక్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాలు.. రజనీబాల, జగన్నాథ్ దంపతులు సైదాబాద్ డివిజన్ రెవెన్యూ బోర్డు కాలనీలో నివాసం ఉంటున్నారు. జగన్నాథ్‌కు ఆరోగ్యం బాగోకపోవడంతో మలక్‌పేటలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. గురువారం రాత్రి ఇంటికి తాళం వేసి భార్యాభర్తలు ఆసుపత్రిలో ఉన్నారు. ఉదయం ఇంటికి వచ్చేసరికి తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలో భద్రపర్చిన 10 తులాలకు పైగా బంగారు నగలు, ఇతర విలువైన వస్తువులు కన్పించలేదు. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## 'విలీన ప్రతిపాదనను వెనక్కి తీసుకోండి'

**పహాడీషరీఫ్:** హైదరాబాద్ నగర శివారులోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను జీహెచ్‌ఎంసీ లో విలీన ప్రతిపాదనను ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని బీజేపీ బడంగ్‌పేట్ ఓబీ సీ మోర్చా అధ్యక్షుడు పెరమోని నరేష్ యాద వ్, యండీ నయీం, గుర్జని గణేశ్ గౌడ్‌లు డిమాండ్ చేశారు. మామిడిపల్లిలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన ఆరు నెలల నుంచి తికమక నిర్ణయాలు తీసుకుంటూ ప్రజలను అయోమయానికి గురి చేస్తుందన్నారు. శివార్లలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు జీహెచ్‌ఎంసీలో విలీనం చేసి ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అస్తిత్వం లేకుండా ముఖ్యమంత్రి కుట్ర పన్నారని ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యే కేఎల్లాఆర్, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిల మధ్య విభేదాలతో ఇలాంటి తప్పుడు నిర్ణయాలు వెలువడుతున్నాయన్నారు.

## కులగణనతోనే బీసీల సామాజికాభివృద్ధి

**కాచిగూడ:** కులగణనతోనే బీసీల సామాజిక, రాజకీయ, ఆర్థిక అభివృద్ధి జరుగుతుందని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ అన్నారు. బీసీ సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ, నీలం వెంకటేష్, రాజేందర్, వేముల రామకృష్ణలతో కలిసి ప్రతినిధుల బృందం ఆదివారం పీసీసీ మాజీ అధ్యక్షుడు వి.హనుమంతరావును కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వేముల రామకృష్ణ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు కులగణన పూర్తి చేసి పంచాయతీ రిజర్వేషన్లను 42 శాతం పెంచేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని వీహెచ్‌ను వారు కోరారు. రిజర్వేషన్లు పెంచిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే విధంగా చూడాలన్నారు.

## 21న విష్ణు సహస్ర నామ పారాయణం

**రామంతాపూర్:** వ్యాస పూర్ణిమ సందర్భంగా ఈనెల 21న లోక కల్యాణం కోసం 500 మందితో అల్వాల్‌లోని శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విష్ణు సహస్ర నామ పారాయణం జరుగుతుందని ఈ కార్యక్రమానికి కులమత భేదాలు లేకుండా అందరూ పాల్గొనవచ్చునని నిర్వాహకులు శాస్త్రుల రఘురామ శర్మ తెలిపారు. ఆసక్తి గల వారు 9440240881 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని అన్నారు.

## ప్రశాంతంగా సివిల్ సర్వీస్ పరీక్షలు

**ఉప్పల్:** ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం నిర్వహించిన సివిల్ సర్వీస్ (ప్రిలిమినరీ) పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మొత్తం ఏడు కేంద్రాల్లో 3264 మంది అభ్యర్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 2385 మంది మాత్రమే పరీక్షలకు హాజరైనట్లు అధికారులు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఉండే విధంగా మల్కాజిగిరి ఏసిపి చక్రపాణి, ఉప్పల్ ఇన్‌స్పెక్టర్ ఎలక్షన్ రెడ్డి, ఎస్ఐ శంకర్‌ల ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు నిర్వహించారు.

**రామంతాపూర్:** గణేష్‌నగర్‌లోని అరోరా పీజీ కళాశాల, శారదానగర్ ప్రిన్స్‌టన్ డిగ్రీకళాశాల, ప్రిన్సెస్ పీజీ కళాశాల , హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ మెగా మహిళా డిగ్రీకళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాల్లో ఆదివారం నిర్వహించిన సివిల్స్ ప్రిలిమినరీ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 9.30 గంటల నుంచి 11.30 గంటల వరకు మొదటి పేపర్, 12.30 గంటల నుంచి 2.30 గంటల వరకు రెండో పేపర్ పరీక్షలు నిర్వహించారు.

## రామోజీరావుకు ఘన నివాళి

**నాగోలు:** నాగోల్‌లోని విజన్ వీవీకే సంస్థ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం అధినేత వి.విజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఈనాడు గ్రూప్ సంస్థల చైర్మన్ రామోజీరావు సంస్మరణ సభ నిర్వహించారు. తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్ రావు తదితరులు హాజరై రామోజీరావు చిత్రపటానికి పూజమాల వేసి నివాళులర్పించారు. పాత్రికేయులు, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, తెలుగు భాషాభిమానులు, కవులు, కళాకారులు పాల్గొన్నారు.